# ఆత్మ హత్య



టి. కమల

బస్సు కుదుపులకు అటు ఇటు కదులుతూ, కాస్త కునుకు తీస్తూ నెత్తి మీది ముసుగు జారిపోకుండా చూసుకొంటూ 70 సంవత్సరాలు నిండిన బామ్మ ప్రయాణం సాగిస్తూంది. దేవుడి మీద పువ్వులైనా తప్పుతాయేమో గాని, ఆమె ప్రయాణం మాత్రం తప్పదు. ఖచ్చితంగా నాలుగు మాసాల కో సారి తన మూట, ముల్లె సర్దుకొని ప్రయాణం సాగించవలిసిందే! ఇది బ్రహ్మ వ్రాసిన వ్రాత కాదు. తన ముత్యాల్లాంటి ముగ్గురు కొడుకులు, కోడళ్ళు చేసుకొన్న తీర్మానం. తనను భాగపరిష్కారం, చేసుకొన్నారు.

ముసలాయన బ్రతికిన రోజుల్లో తనకు ఈ తిప్పలు లేవాయె. ఆయనకు వచ్చే పెన్షన్‌తో తా మిరువురు దర్జాగా కాలక్షేపం చేశారు. ఏ కొడుకును నయాపైసా అడగలేదు. చాలినా, చాలక పోయినా అందులోనే ఇద్దరు సర్దుకొనే వారు. "ఏమైనా డబ్బు కావాలా?" అని ఏ కొడుకూ ఆయన బ్రతికిన రోజుల్లో అడిగిన పాపాన పోలేదు. అప్పుడప్పుడు ఆయన అంటూ ఉండే వారు—"నేను పోయిన తరవాత నీ గతి ఏమిటే?" అని. "ఏమిటండీ మీ చాదస్తం! ముగ్గురు కొడుకులు ఉండగా మన కేమిటండీ లోటు! మనం వస్తా మంటే వాళ్ళు వద్దన్నారు గనకనా?" అని కొడుకుల్ని వెనకేసుకు వచ్చేది. ఈ నాటి తన స్థితి తలుచుకొంటే. . .

"బామ్మగారూ . . . ఇక్కడేగా మీరు దిగాల్సింది?" అని పక్క సీటులో కూర్చున్న ఆవిడ తనని పిలవగా బామ్మ ఈ లోకంలోకి వచ్చినట్లది. "అవునమ్మా!" అంటూ సంచీ తీసుకొని మెల్లిగా దిగింది. నడక సాగించింది. దారిలో నడుస్తూ నడుస్తూ కళ్ళు సరిగ్గా కనిపించనందున చిన్ని కుక్కపిల్లమీద కాలు పెట్టింది. అది "కుయ్, కుయ్" అంటూఅరుచుకొంటూ వెళ్ళిపోయింది. 'అయ్యో! రామ రామ! ఆ కుక్కపిల్ల ఎంత బాధపడిందో! పాపం' అనుకొంటూ, 'ఏమిటో ఈ మధ్య కళ్ళు బొత్తిగా కనిపించడం లేదు. కళ్ళు ఆపరేషన్ చేయించుకొంటే బాగుంటుంది. కా. . . నీ. . . ఎలా? ఎవరు చేయిస్తారు? పిల్లికి గంట కట్టేవా రెవ రన్నట్లు—ఉన్నవి రెండు కళ్ళు! ముగ్గురు కొడుకులు!' అనుకొంది. ఈ ఆపరేషన్ ఖర్చులు ఎవరు భరాయించాలన్నదే

నీ వంటే నీవు అని ఉత్తరాల్లో వాదులాడుకొని ప్రస్తుతం ఆ మాటే మరిచారు. పెద్దకొడుకును నోరు విడిచి- "నాయనా, కాస్త కళ్ళు ఆపరేషన్ చేయించు" అంటే, 'అలాగేలే' అంటూ ఆఫీసుకు వెళతాడు. మళ్ళీ ఆ మాట ఎత్తడు. ఇలాగే, 3 నెలల 26 రోజుల కాలం గడిచిపోతుంది. ఒక్క సుముహూర్తాన "ఎలాగూ ఇంక నాలుగు రోజులకు కృష్ణ దగ్గిరికి వెళతావుగా! అక్కడే ఆపరేషన్ చేయించుకో! చూస్తున్నావుగా, నాకు క్షణం తీరిక లేదు. నీ కోడలికి ఒంట్లో బాగా లేదు. అది కనక నీకు మడితో వంట వండి పెడుతూంది. ఆ మాత్రానికి ఆనందించు!" అంటూ భార్యను వెనకేసుకు వస్తాడు.

ఇక రెండవ అబ్బాయిని అడిగితే, "కానీయమ్మా. . . చేయిస్తా. అన్నయ్య ఇంట్లో మొన్నటిదాకా ఉన్నావుగా, అక్కడ అడిగుండకూడదూ?" అంటూ ఆదిలోనే హంసపాద మన్నట్లు విసుక్కునే కొడుకును చూస్తే, 'వద్దులే, నాయనా. ఎందుకులే నీకు దండగ ఖర్చు' అనుకొని మళ్ళీ ఆ మాట అడగదు.

"ఎప్పుడు వచ్చారు, బామ్మగారూ! బస్టాండుకు ఎవరూ రాలేదా?" అంటూ ప్రశ్నించిన పలుకుల్తో తిరిగి ఈ లోకంలోకి వచ్చింది. "ఎవరూ. . . రాధమ్మేనా! ఏం తల్లీ, కులాసాగా ఉన్నావా? ఎక్కడికి బయలుదేరావు?" అంది. రాధ చిరునవ్వు లొలకబోస్తూ,

"బామ్మగారు, ఈ రోజు బాబు పుట్టిన రోజు. సాయంత్రం పేరంటానికి అందరు వస్తారు. కావలసిన సరుకులు కొనడానికి వచ్చాను" అంటూ "సాయంత్రం వచ్చి బాబును ఆశీర్వదించండి, బామ్మగారూ" అంటూ వెళ్లిపోయింది.

'చిన్నప్పుడు తానూ ఇలాగే పిల్లలకు వేడుకలు జరిపించింది. కోరింది కొనిపెట్టింది. ఇప్పుడు తాను ఎందుకూ పనికిరాని ఎముకలగూడు!' అనుకొంటూ బయలుదేరింది. ఇల్లు చేరుకొనేసరికి మధ్యాహ్నం 2 గంటలయింది. "అమ్మా, నానమ్మ వచ్చిందే" అంటూ 8 ఏండ్ల నాని గెంతుతూ వంట ఇంట్లోకి సంతోషంగా పరిగెత్తాడు. వాడికి నానమ్మ అంటే ప్రాణం. కారణం ఒక్కటే. వాడు కోరినన్ని కథలు తాను చెబుతుంది. తాను ఊరికి బయలుదేరే రోజున "నానమ్మా, నీవు వెళ్లద్దు!" అంటూ ఏడుస్తాడు. నాలుగు నెలల అనంతరం తాను ఒక్క గడియకూడా ఉండకూడదుగా! పసివాడు ఏడిస్తే తన కళ్లు చెమ్మగిల్లుతాయి. "మళ్లీ త్వరగానే వచ్చేస్తాగా, నాయనా!" అంటూ బయలుదేరుతుంది.

సుభద్రమ్మ వంట ఇంట్లోనుంచి వీధివంక చూసి, అప్పుడే 4 నెలలు అయిపోయిందా అన్నట్లు, "రండి" అంది. సంచీ మూలకు పెట్టి అందులో నుంచి రెండు అరటిపళ్లు తీసి నానిచేతిలో పెట్టి, సంచీలోని తన మాసిన చీరను బయటకు తీసి, స్నానానికి బయలుదేరింది. సాయంత్రం 7 గంటలకు అబ్బాయి ఇంటికి వచ్చాడు. "ఏం అమ్మా! కులాసాగా ఉన్నావా?" అంటూ విధిగా పలకరించి వెళ్లిపోయాడు. 'కాకపోతే ముడతలుపడ్డ ముసలిదానితో మాటలు ఏముంటాయి కనక?' అనుకొంటూ బామ్మ ఓ వ[illegible]ాల పడుకొంది, గతాన్ని తలుచుకొంటూ.

తనకు చిన్నప్పుడే పెళ్లయినా, పిల్లలు మాత్రం కలగలేదు. ఎంతో దీనంగా కనపడ్డ దేవుళ్లకు మొక్కుకొంది. వ్రతాలు చేసింది. నోములు నోచింది. తాయెత్తులు కట్టుకొంది. నవగ్రహ విగ్రహాలకు పూజలు చేసి, దానాలు చేసింది. ధర్మాలు చేసింది. కరుణామయుడు కటాక్షించాడు. తన 35 వ ఏట పెద్దకొడుకు పుట్టాడు. వాడికి రెండు సంవత్సరాలు నిండేలోగా చిన్నవాడు కలిగాడు. ఏడాదికే మూడవ...

> "దయమాలిన కొడుకు దగ్గర ఉండడంకన్న మరణం మేలు" అని చివరిదశలో ఇంకా సశేషంగా జీవిస్తున్న తలిదండ్రులు అనుకోక పోరు. ప్రయోజకులైన బిడ్డలు తమ తలిదండ్రులు తమ కోసం చేసిన తపస్సును గుర్తించరు. అందుకే ముసలివాళ్ల జీవితాలు, బ్రతికున్న శవాల్లా తయారవు తుంటాయి.

ముగ్గురిని ఎంత అపురూపంగా పెంచింది! తరుచు తన భర్త "వయసు మీరిన కాలంలో తీరిగ్గా పిల్లల్ని కంటున్నావు. వీళ్లు పెద్దవాళ్లయి మనల్ని ఉద్ధరించే దేముందిలే!" అని నవ్వేవారు. ఆ మాటలకు తనకు కోపం ముంచుకువచ్చేది. మూతి ముడుచుకొనేది. తన్ను చూచి ఆయన నవ్వేవారు. "లేదులేవే. నీ కొడుకులు రత్నాల్లాంటివారులే. అన్నం వడ్డించు!" అని నవ్వుకొంటూ బాబును ఎత్తుకొనేవారు. ముగ్గురిని తన పంచప్రాణాలుగా పెంచింది. కోరిందల్లా కొనిపెట్టింది. పెద్ద చదువులు చదివించింది. డబ్బు చాలకపోతే, తన నగలు అమ్మి చదివించింది. కానీ, ప్రస్తుతం తన కొడుకులకు తాను బరువయ్యింది. తానంటే ఎంతో అసహ్యం! ఎవ్వరికి తాను పనికిరాదు. తన మాట నలుసంతయినా వినరు. ఒక్కొక్క కోడలి మనస్తత్త్వం ఒక్కో విధంగా ఉంది. పెద్ద కోడలు అతి పొదుపరి. ఆ పొదుపు అంతా ఇంతా కాదు. నెలకు ఎంత కావాలో అంత సరుకు తెప్పించదు. పిల్లలు ఏదయినా ఫలహారం చేసి పెట్టమంటే, "నూనె తెప్పించాలి, సెనగపిండి తేవాలి" అంటుంది. తన పిల్లలకే చేసిపెట్టనప్పుడు తనకు ఏం చేసి పెడుతుంది?

పొద్దున్నే పక్క గదినుంచి మాటలు వినవస్తున్నాయి. "మీ అమ్మగారు వచ్చారు. కంటి ఆపరేషన్ గురించి ప్రస్తావిస్తారేమో! ఏవేం పెట్టుకో...



అనుకరణలో అందం

ఫోటో— ప్రసాదరావు (ఖర్గపూర్)



కండి. ఆపరేషన్ అంటే మాటలా? వంద రూపాయలన్నా అవుతుంది. అయినా ఆవిడ చాదస్తంగాని ఇప్పుడా కళ్ళు బాగుచేయించుకొని ఏం చేయాలి? కృష్ణా! రామా! అని ఓ మూల కూర్చోరాదూ!'' అంటున్న మాటలకు రత్నంలాంటి రెండవ కొడుకు మాట్లాడలేదు.

బామ్మగారికి కళ్ళనీళ్ళు తిరిగాయి. వేలకు వేలు పెట్టి తాను చదివించింది. ముసలాయన మొత్తుకొన్నా వినక పంతం పట్టి ఇంజినీరు కోర్సు చదివించింది. ఈ నాడు వంద రూపాయలు తన కోసం ఖర్చు చేయడానికి మనస్కరించడం లేదు. 'భగవంతుడా! నీ సృష్టి విచిత్రమయ్యా! తల్లి ఎంతగా పిల్లల్ని ప్రేమిస్తుందో, అంతటి అభిమానాన్నే తిరిగి తన పిల్లలు తనపై చూపెట్టాలని ప్రతి తల్లికి ఉండే కోరిక సహజం మరి. పిల్లల హృదయాలను ఎందుకంత కఠినశిలలుగా మార్చివేస్తావు? ఈ లోపం నీ దగ్గరే ఉంది! ఇది నీ చేతిలో పనే. మరి ఎందు కిలా చేస్తున్నావు? ఆదరించవలసినవాళ్ళే నిరాదరిస్తే, మా బ్రతుకులు ఎలా తెల్లారాలి? పోనీ, అది నా ఇష్టం అంటావా! సరేకానీ, ఎందుకు ఇంతింత ఆయుష్షులు మాకు ప్రసాదిస్తావు? కొడుకులు ప్రయోజకులు అయిననాడు తల్లి తనువు చాలించాలి అన్న నియమం నీ సృష్టిలో ఉండి ఉంటే ఎంత బాగుండేది!' అని అనుకొంది. చిన్నప్పుడు తన భర్త అన్నమాటలు గుర్తుకు వచ్చాయి. రెండవ కొడుకు పుట్టినరోజుకు బట్టలు తెస్తూ తనకు ఓ సిల్కుచీర 50 రూపాయలు పెట్టి తెచ్చారు. తన ఆనందానికి అంతు లేదు. అయినా ఆ సంతోషంలో ''ఎందుకండీ ఇప్పుడు చీరలు? ఉన్నాయిగా!'' అంటే, ''కట్టుకోవే. ఆడవాళ్ళు ఏం సుఖపడ్డా, ఏ ఆనందం అనుభవించినా, భర్త దగ్గిరే! భర్త తరవాత ఎవ్వరూ-కనీసం కడుపున పుట్టిన పిల్లలైనా—అంత సుఖపెట్టలేరు. అందుకే అన్నారు, 'స్త్రీలకు భర్త రాజ్యం రామరాజ్యం, కొడుకుల రాజ్యం యమరాజ్యం' అని.'' ఆ మాటల్లో సత్యం ఇప్పుడు తెలియవచ్చింది. అదృష్టవంతులు ఆయన. వెళ్ళిపోయారు. 'నేను ఆయన దగ్గిరికి ఎప్పుడు వెళతానో' అనుకొంటూ లేచి, చాప చుట్టి మూల నుంచి ముఖం కడుక్కోడానికి వెళ్ళింది.

రెండవ కొడుకు ఇంటక్కు కొంత కాలక్షేపం ఏమ దగ్గిరనే రాములవారి గుడి ఉంది. రోజూ సాయంత్రం బయలుదేరి గుడికి వెళ్ళేది. ఓ రోజు సాయంత్రం దారిలో తన చిన్ననాటి స్నేహితురాలు సుందరమ్మ కనిపించింది. దగ్గిరగా వచ్చి బామ్మను పలకరించింది. ''పార్వతీ! అలా చూడనట్లే వెళ్ళిపోతున్నావు!'' అంది. ''ఎవరూ? సుందరమ్మవా? ఈ మధ్య బొత్తిగా కళ్ళు కనిపించడం లేదు. అంతా కులాసాగా ఉన్నారా?'' అంది. ''ఆఁ... అందరూ కులాసాగానే ఉన్నారు. అదృష్టమంటే నీదేనే, పార్వతీ! నీకేం, ముగ్గురు కొడుకులు మూడు రత్నాలు. ఒక్క క్షణం నిన్ను వదిలి ఉండరు కదా! 4 నెలలు అయిందంటే చాలు, మరో అబ్బాయి పిలిపించుకొంటాడు. ఎంత అదృష్టవంతురాలివే'' అంది. బామ్మ నవ్వుకొంది. ''అంతా ఆ దేవుడి దయే, సుందరమ్మా!'' బామ్మ మళ్ళీ సుందరమ్మను, ''అన్నట్లు ఎక్కడికి బయలుదేరావు?'' అడిగింది. ''అయ్యో, నా రాత! ఎందుకు చెబుతావులే! నా ఇద్దరు కొడుకులు ఉన్న ఊళ్ళోనే వేరుపడ్డారు. నా ఒక్క ప్రాణం కోసం వాళ్ళిద్దరూ పోట్లాడుకొన్నారు. 'నాకు పిల్లలు జాస్తి. నా సంపాదనే నాకు చాలదు. అమ్మను నీ దగ్గిరే ఉంచుకో'మని పెద్దవాడు, 'అస్తమానం నా పెళ్ళానికి, పిల్లలకు రోగాలు వస్తూంటాయి. నాకు వీలుపడ'దని చిన్నవాడు దెబ్బలాడుకొన్నారు. ఆఖరికి ఒక్క తీర్మానానికి వచ్చారు. పెద్దవాడి ఇంట్లో 6 నెలలు, చిన్నవాడి ఇంట్లో 6 నెలలు నేను ఉండేటట్లు తీర్మానించుకొన్నారు. ఎంత హీనం అయిందే, తల్లీ, నా బ్రతుకు!'' అంటూ కళ్ళనీళ్ళు కార్చింది. బామ్మ అనుకొంది, 'ఈ కాలంలో అందరి తల్లుల గతి ఇంతేనేమో! అందరు కష్టసుఖాలు ఒకరితో చెప్పుకొంటారు. తాను మాత్రం ఎవ్వరితో ఇంతవరకు ఒక్క విషయం కూడా చెప్పుకొని ఎరగదు. అందుకే లోకం దృష్టిలో పార్వతమ్మ అదృష్టవంతురాలు!' అనుకుంది.

గుడినుంచి ఇంటికి వచ్చేటప్పటికి రాత్రి 7 గంటలు అయింది. పిల్లలు భోజనంచేస్తున్నట్లుగా ఉంది. ఆ భోంచేస్తున్న వైనం చూస్తూంటే బామ్మకు ఒళ్ళంతా చిటపటలాడింది. 'ఏం పెంపకాలో ఏమో! నోరెరగని పసివాళ్ళు! కుక్కలకు పడవేసినట్లు కంచాల్లో పెట్టేస్తారు. ఒకరు ఎడి చేత్తో, ఒకరు ఎడమ చేత్తో ఇదా మీదా వేసుకొం న్నారు. తన కాలంలో 10 ఏళ్ల అబ్బాయినించి 3 ఏళ్ల అబ్బాయి వరకు అందరికి ఓ కంచంలో పెద్దవాళ్ళు కలిపి చేతిలో గోళీకాయల్లా ముద్దలు పెడుతుంటే లక్షణంగా భోజనం చేసేవాళ్ళు. ఈ కాలంలో అన్నప్రాశనం చేసింది మొదలు ఓ 'పెసలు' కంచం (''స్పెషల్'' అన్న మాట) లో ఇన్ని మెతుకులు వేసి తింటే తిను, లేకుంటే లేదంటారు' అనుకుంది. మనసు నిలవక ఒకనాడు కోడలుతో, ''ఏమే, అమ్మాయ్, పిల్లలకు కాస్త తినిపించరాదుటే'' అంటే ''ఆఁ. . . మీ కేం తెలుసు? కలిపి వేస్తే బాగుందని మామూలుకన్నా ఎక్కువ తింటారు. వెంటనే అజీర్తి చేస్తుంది'' అని తన మాటను విదిలించి పారేసింది. ఈ శాస్త్రం ఈ 70



సమాలోచన ఫోటో— కె. వి. రామమోహనరావు

ఏళ్ల అనంతరం తాను వింటూంది. అయినా తన కెందుకని గమ్మున కూర్చుంది. రాత్రి 9 గంటలకు తన వాటా ఓ గ్లాసు పాలు, రెండు అరటి పండ్లు తినేసి మారుమాట లేకుండా పడుకుంది.

పొద్దున్నే బయట కోడలు ఎవరితోనో ఘర్షణ పడుతూంది. ఎవరో అని వెళ్ళి చూచింది. చాకలివాడు. అతనితో ఏదో అంటూంది కోడలు. చాకలివాడిని చూస్తూనే తన చీరవైపు ఒకసారి చూచుకొంది. తెల్ల మల్లుపంచ ఇప్పుడు కావిరంగులో ఉంది. ఎన్నాళ్ళ నుంచో తనకు ఒక కోరిక ఉంది. 'తెల్లపంచలు నాలుగు ఒకేసారి కొనేయాలి. రెండు చాకలివాడికి ఇడు రోజూ ఒకటి చొప్పున కట్టుకొని, మరొకటి రేపటికి ఆరేసుకోవాలి. అప్పుడు తన బట్టలు శుభ్రంగా పాలవెన్నెలలా ఉంటాయి' అనుకుంది. కానీ కొని ఇచ్చే వారెవరు? సంవత్సరానికి రెండు బట్టలు తీసి ఇస్తారు. అంతే. మారుచీర అడగకూడదు. తెల్లబట్టలు ఎంత ఇంట్లో ఉతికినా, ఒక్కసారైనా చాకలివాడికి వేస్తేనే బాగుంటుంది. పోనీ, ఉన్న రెండు బట్టలకు ఇంత సబ్బుముక్క పెడదామని ఏ కోడలు అనుకోదు.'

రోజులు గడుస్తున్నాయి. ఆ వేళ ఏకాదశి. పొద్దున్నే స్నానం చేసి గుడికి బయలుదేరింది. గుడిలో తీర్థం తీసుకొంటుంటే, 'ఓ అణా డబ్బులైనా పూజారిచేతిలో పడవేస్తే బాగుంటుంది' అనుకొంది. తన దగ్గిర డబ్బులెక్కడివి?

'ముసలిదానికి డబ్బు లెందుకని కొడుకుల ఊహేమో! 4 మాసాలకు ప్రయాణం చేసే రోజున చిల్లర డబ్బులుకూడా తనకు ఇవ్వరు. బస్సులో కూర్చోపెట్టి టికెట్టు కొని ఇచ్చి, ఓ డజను అరటిపళ్ళు కొని ఇస్తారు. అంతే!' అనుకొంటూ, ''నానీ. . .'' అని తన మనవణ్ణి పిలిచింది. ''ఏమిటే, నానమ్మా'' అంటూ గెంతుతూ వచ్చాడు. ''అమ్మనడిగి ఓ అణా డబ్బులు పట్రా, నాయనా, గుడికి వెళ్ళివస్తా'' నంది. క్షణంలో నాని తిరిగి వచ్చాడు, ''అమ్మ దగ్గిర చిల్లర లేదట, నానమ్మా!'' అంటూ వెళ్ళబోయి, ''ఉండు నానమ్మా నా దగ్గిర పది పైసలున్నాయి, ఇందా'' అంటూ తీసి ఇవ్వబోయాడు. బామ్మ అమాంతంగా నానిని దగ్గిరికి తీసుకొంది.

'నీ కున్న అభిమానంలో వెయ్యో వంతు మీ అమ్మ నాన్నలకు ఉండి ఉంటే నా బ్రతుకు ఎంత హాయిగా గడిచిపోయేది!' అనుకొంది. "వద్దులే, నాన్నా, నీ దగ్గరే ఉంచుకొని ఏమైనా కొనుక్కొని తిను" అని మెల్లగా గుడికి బయలుదేరింది.

దేవుడికి దండం పెట్టుకొని తీర్థం పుచ్చుకొంది. వెనక ఎవరో తన్ని గురించే అంటున్నారు.

"ముసలమ్మ రోజూ గుడికివస్తుందా, ఒక్క నయాపైసాకూడా దేవుడికి వెయ్యదు. లక్షణంగా ముగ్గురు కొడుకులు సంపాదిస్తున్నారు. తనకు డబ్బులు ఇవ్వకుండానే ఉంటారా! ఆమెకు మనసు రావద్దూ!"

ఆ వేళంతా ఎందుకో మనస్సు బాగా లేకపోయింది.

* * *

అప్పుడే రెండవ కొడుకు దగ్గిరికి వచ్చి 4 నెలలు అయింది. ఇక తాను ఇక్కడ ఉండకూడదు. ప్రయాణం రోజు మాత్రం కొడుకు జట్కా తెప్పించాడు. "తల్లి అంటే ఎంత అభిమానమో! అదృష్టం అంటే బామ్మగారిదేలే అని" అంటున్న మాటలు జట్కాలో కూర్చున్న తనకు స్పష్టంగా వినవచ్చాయి.

* * *

ముచ్చటయిన మూడవ కొడుకు ఇంటికి బయలుదేరింది. కడపనించి హైదరాబాద్ ఎన్ని మైళ్లో తనకు తెలియదు గాని, ఆ ఊరినుంచి ఈ ఊరు చేరేటప్పటికి—అందులో బస్సులో ప్రయాణం చేసేటప్పటికి — ఒళ్ళు హూనమై పోతుంది. జ్వరం వచ్చినట్లు అయిపోతుంది.

బస్సు హైదరాబాద్ చేరుకుంది. బామ్మ మెల్లగా దిగింది. ఎవరైనా బస్సుస్టాండుకు వచ్చారేమో అని ఆత్రంగా ఆశగా చూచింది. ఎవ్వరు రాలేదు; రారుకూడా. ఈ ప్రయాణం తనకు గాని, వాళ్ళకుగాని కొత్తకాదు. 10 సంవత్సరాలనుంచి సాగుతూనే ఉంది. దారి తెలిసి వస్తుందిలే అన్న నిర్లక్ష్యం వాళ్లకుంటుంది. చేతిసంచీతో బయలుదేరింది. సన్నగా వాన ప్రారంభమయింది. రిక్షాలో వెడదామంటే, తనకు ఫలానా వీథి అని చెప్పడానికి తెలియదు. రిక్షావాళ్ళు పేచీకి దిగారంటే ఒకపట్టాన వదలరు. ఎందుకులే అనుకొని నడక సాగించింది. వర్షం ఎక్కువైంది. ఓ ఇంటిముందర వెళ్ళి నిలబడ్డది. ఆ ఇంట్లో ఎవరో

ణపు హడావిడిలో ఉన్నట్లు ఉంది. 'అయ్యో, సమయానికి అడ్డగా నేను నిలబడ్డానే అనుకుంటారేమో' అనుకొని, బయలుదేరబోయింది. "అరే, వాన వస్తుంది. లోపలికి రండి, బామ్మగారూ!" అంటూ ఎంతో ఆప్యాయంగా ఓ పాతికేళ్ళ అబ్బాయి లోపలినించి పిలిచాడు. "ఆ పక్క గుమ్మంలో నిలబడతా, నాయనా! ఇంట్లో ఎవరో ప్రయాణం చేసేటట్లు ఉన్నారు. మధ్య నే నెందుకు?" అని వెళ్లబోయింది. "అదేమిటిది, బామ్మగారూ! మీరు అలా అనుకోకండి. మా కా పట్టింపులు



శ్రమ ఫలితం ఫోటో— సి. ఎస్. రావు, (భోపాల్)

ఏమీ లేవు. ఇంతకూ ప్రయాణం చేసేది ఎవరనుకొన్నారు? మా అమ్మే! రండి, లోపలికి, చూద్దురుగాని" అని బలవంతంగా లోపలికి తీసుకువెళ్లాడు.

తనలాంటి ముసలమ్మే కట్టుకొన్న తెల్లటి పట్టుపంచ చూస్తూనే తన చీరపై పాక సారి చూచుకొంది. ఎంత అసహ్యంగా ఉందో! "ఎక్కడికి, నాయనా, మీ అమ్మ ప్రయాణం?" (నా లాగే...మూడో కొడుకు ఇంటికి కాదుకదా? ... అంది. ఆ ...

చెప్పాడు: "మా అమ్మ కాశీకి వెడుతూంది. ఈ వీథిలోని వాళ్ళు వెడుతూంటే, అమ్మనుకూడా పంపిస్తున్నా బామ్మగారూ. కూర్చోండి. వాన వెలుస్తూనే వెడుదురుగాని."

'అదృష్టవంతురాలివి, తల్లీ, వెళ్లిరా! నా బ్రతుకంతా ఈ బస్సు ప్రయాణంలోనే సమాప్తం అవాలి. కొడుకుల్ని కనేది కొరివి పెట్టడానికే గాని, కనికరం చూపడానికి కాదు అన్న నా అభిప్రాయం ఈ నాటితో తుడిచివేస్తున్నా. నీ లాంటి అదృష్టవంతులు, నా లాంటి దురదృష్టవంతులు ఈ లోకంలో సమానంగానే ఉంటారు. అది దైవ సృష్టి. దేవుడికి పక్షపాతాలు, మోసాలు, ద్వేషాలు తెలియవు. కాని మనం ఎంత వరకు కోరుకున్నామో అంతే ప్రాప్తం' అని మనస్సులో మననం చేసుకొంటూ కూర్చుంది. వాన వెలిసింది. "వస్తా, నాయనా" అంటూ లేచింది. "ఉండండి, బామ్మగారూ, కాస్త పాలు తాగి వెళుదురు గాని" అని ఓ గ్లాసు పాలు తెచ్చి ఇచ్చా... ఎంత బాగున్నాయి పాలు!

తను రోజూ తాగేది పాలలాంటి నీళ్ళు! కళ్ళనీళ్లు తిరిగాయి. ఇంత నిరాదరణగా బతికేకంటే చస్తే మేలనిపించింది. పాలగ్లాసు కింద పెట్టి, "మీకు చాలా శ్రమ కలిగించాను. వస్తానమ్మా!" అంటూ బయలుదేరింది.

* * *

చిన్నకొడుకు ఇంటికి వచ్చి నెల రోజులు దాటింది. నెల రోజులనించి కూడా రహస్యంగా ఎవ్వరికి తెలియకుండా రోజు కొక్కటి చొప్పున దాచుకొంటూనే ఉంది. 'ఈవాడు లెక్క పెట్టాలి' అనుకుంది బామ్మ. రాత్రి పడుకొనేముందు రహస్యంగా తన తలగడలో దాచిన రేకుడబ్బీ తీసింది. ఎవరూ చూడకుండా లెక్క పెట్టింది. ఒకటి, రెండు, మూడు— ముప్పయి అయింది. బామ్మ కళ్లు ఆనందంతో మెరిశాయి. అటూ ఇటూ చూసింది. 'ఎవ్వరూ చూడలేదు గదా. హూఁ. తనని ఎవరు చూస్తారు? తను ఎవరికి కావాలి? తాను బ్రతికినశవం— అంతే!' కళ్లనీళ్లు తిరిగాయి. 'భగవంతుడా, నన్ను క్షమించు. నేను చేస్తున్న ఈ పనికి నీవు ఏ శిక్ష విధించినా, సంతోషంగా అనుభవిస్తాను. నాలో శక్తి లేదు. ఈ నిరాదరణను నేను సహించలేను. ఈ ప్రయాణాలు నేను చేయలేను. ఒకప్పుడు నిన్ను, నీ సృష్టిని అజ్ఞానినై నిందించాను. ఇవి నీ సృష్టి లోపంకాదు. నా కర్మఫలం. నా వంతుకు తెచ్చుకొన్న దింతే. దయమాలిన కొడుకుల దగ్గిర ఉండడం కంటే మరణమే మేలనిపించింది.'

కడసారిగా ముద్దుల మూడవ కొడుకును చూద్దాం అనుకొని మెల్లగా తడుముకొంటూ సూర్యం గదికి వెళ్లింది. "నాయనా, సూర్యం!" అంది. "అమ్మా. . . నిన్నటితో నిద్ర మాత్రలు అయిపోయాయి. రేపు తెచ్చి ఇస్తాను. ఈ రోజుకు ఎలాగో నిద్ర పోవడానికి ప్రయత్నించు!" అన్నాడు. 'నేను అందుకోసం రాలేదు, నాయనా, నిన్ను చూద్దాం అని వచ్చాను. అంతే. రేపటినించి అవసరం ఉండదులే, నాయనా!' అనుకొని తిరిగి తన గదిలోకి వెళ్ళి పడుకొంది. మళ్ళీ లేవలేదు.

"బామ్మ అదృష్టవంతురాలు. ముత్యాల్లాంటి ముగ్గురు కొడుకుల చేతిమీదుగా వెళ్లిపోయింది" అని ఆ నాడు చివరిసారిగా మోసుకుపోతున్న బామ్మగారి శవాన్ని చూచి లోకం కోడై కూసింది. ★